ఈవీఎంలను కట్టుదిట్టంగా భద్రపరచాలి: కలెక్టర్


యార్డులో ఈవీఎం గోదాము వద్ద కలెక్టర్, అధికారులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : గోదాముల్లో ఉంచిన ఈవీఎంలను కట్టుదిట్టంగా భద్రపరచాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మార్కెట్ యార్డులో గోదాములను కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్ భద్రత పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాములను తెరచి ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లను పరిశీలించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. డీఆర్వో వినాయకం, నోడల్ అధికారి విశ్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వ్యాధుల నివారణకు వైద్యుల సూచనలు పాటించాలి

నరసరావుపేట అర్బన్ : గుండె సంబంధిత వ్యాధుల నివారణకు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. మహాత్మాగాంధీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా 29న 5కే నడక పోటీ నిర్వహిస్తున్నారు. విజేతలకు అందించే సైకిళ్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శారీరక వ్యాయామం ఆరోగ్యానికి అవసరమని, అవగాహన కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనాలన్నారు. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. నిర్వాహకులు డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డిని అభినందించారు.

కోటప్పకొండ ఈవోగా చంద్రశేఖర్



నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా సహాయ కమిషనర్ దాసరి చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లోగా భాగంగా నెల్లూరు జిల్లా మూలపేట నుంచి కోటప్పకొండకు ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు స్వీకరించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సై

నవంబరు నాటికి పూర్తయ్యేలా ఏర్పాట్లు



ఈనాడు – అమరావతి

నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజీ ప్రాజెక్టుల కింద రైతుల భాగస్వామ్యంతో ప్రతీ ఎకరాకు సాగునీరందించే దిశగా తెదేపా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే రైతు ప్రతినిధులను ఎన్నుకోవడానికి వీలుగా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఉత్తర్వులిచ్చింది. ఓటర్ల జాబితా, ఎన్నికలు, ఎంపిక ప్రక్రియ మొత్తం నవంబరు తొలివారానికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓటర్లుగా ఉన్న ఆయా కాలువల ఆయకట్టు రైతులు సమర్థులను కమిటీ ఛైర్మన్లుగా ఎన్నుకునే వెసులుబాటు ఉంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా వాటిని నిర్వీర్యం చేసింది. కాలువల నిర్వహణ, కనీస మరమ్మతులకు నిధులివ్వలేదు. ఈ కారణంగానే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు కాలువల గట్లు భారీగా తెగిపోయి వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

సాగర్ కాలువ కింద....

నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలోని లింగంగుంట్ల సర్కిల్ కింద ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతాలున్నాయి. ఇందులో 259 నీటి వినియోగదారుల సంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ, ఒక ప్రాజెక్టు కమిటీ ఉంటాయి.

కృష్ణా పశ్చిమ డెల్టాలో...

కృష్ణా పశ్చిమ డెల్టాలోని ఉమ్మడి గుంటూరు ఆయకట్టు గుంటూరు సర్కిల్ పర్యవేక్షణలో ఉంటుంది. బాపట్ల జిల్లాలో 16 డిస్ట్రిబ్యూటరీ కమిటీల (డీసీ) కింద 94 డబ్ల్యూయూఏలు, గుంటూరు జిల్లాలో 9 డీసీల కింద 50 డబ్ల్యూయూఏలు, ప్రకాశం జిల్లాలో ఒక డీసీ కింద 2 డబ్ల్యూయూఏలున్నాయి. గుంటూరువాహిని కింద రెండు డీసీల పరిధిలో 14 డబ్ల్యూయూఏలున్నాయి. మొత్తం 22 డీసీలు, 160 డబ్ల్యూయూలు ఉన్నాయి. ఇందులో 6 డీసీలు రెండు జిల్లాల్లో కలిసి ఉన్నాయి.

కమిటీల స్వరూపం ఇలా..

కాలువల కింద 6 నుంచి 12 మందితో ప్రాదేశి నియోజకవర్గాలుగా (టీసీ)గా గుర్తిస్తారు. ఇందులో ప్రతి ఆయకట్టుదారుడు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారుల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలి. వీరంతా నీటి వినియోగదారుల సంఘాన్ని (డబ్ల్యుయూఏ) ఎన్నుకుంటారు. వీటి ఛైర్మన్లుగా ఎన్నికైన వారు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఛైర్మన్లను, వీరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. ☛ సాగర్ కాలువల కింద లింగంగుంట్ల, ఒంగోలు సర్కిళ్లున్నాయి. వీటికి ఒకే ప్రాజెక్టు కమిటీ ఉంటుంది. ☛ కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో గుంటూరు సర్కిల్ కింద అన్ని సంఘాలుంటాయి. ఇక్కడి డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఇందులో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల రైతులు ఓటర్లుగా ఉంటారు.

చిన్న నీటిపారుదల శాఖ పరిధిలో...

ఉమ్మడి జిల్లాలో చిన్ననీటిపారుదల కింద 60 డబ్ల్యూయూఏలున్నాయి. పల్నాడు పరిధిలో 55, గుంటూరు జిల్లాలో 5 ఉన్నాయి. ఇవన్నీ చెరువుల కింద 21,234 ఎకరాల ఆయకట్టు ఆధారంగా ఏర్పాటవుతాయి. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్నందున ఇక్కడ డీసీ, పీసీ ఉండవు.

ఆయకట్టుదారులకు మెరుగైన సేవలు: నీటి వినియోగదారుల సంఘాలుంటే సంబంధిత ఛైర్మన్లు ఆయా కాలువల కింద సాగునీరు సక్రమంగా వెళ్లేలా చూస్తారు. అత్యవసర పనులు చేయాల్సి వచ్చినప్పుడు అధికారులకు సమాచారం ఇచ్చి యుద్ధప్రాతిపదికన అయ్యేలా చూస్తారు. చివరి భూములకు నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. వరదలు, భారీ వర్షాల సమయంలో కాలువలు, డ్రెయిన్ల గట్ల పరిస్థితి అధికారులకు తెలియజేసి అవసరమైన చర్యలు చేపడతారు.

పంట మిగల్లేదు.. పరిహారం అందలేదు

కర్షకుడి కష్టం నీటిపాలై వేదన

సిబ్బంది అలసత్వంతో న్యాయం జరగలేదని బాధితుల ఆందోళన

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, అచ్చంపేట, అమరావతి


అమరావతిలోని ఏవో కార్యాలయం వద్ద రైతుల నిరసన

అధికారుల నిర్లక్ష్యంతో పలుచోట్ల అర్హులకు జాబితాలో చోటుదక్కలేదు. అనర్హుల ఖాతాలో పరిహారం జమవడమే కాకుండా.. పంట నాలుగురోజులపాటు నీటిలో ఉండి నష్టపోయిన రైతులకు మొండిచేయి మిగిలింది. ఇటీవల విడుదల చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ అర్హుల జాబితాలో బాధితులమైన తమను చేర్చకుండా నీటమునగని వారిని చేర్చారని రైతులు ఆందోళన చేశారు. వరదలకు జిల్లాలోని అచ్చంపేట, అమరావతి మండలాల్లోని పలు గ్రామాలు బాగా ప్రభావితమయ్యాయి. రోజులకొద్దీ నీరు నిలవడమే కాకుండా చెరువులను తలపించాయి. పెదమద్దూరు వాగు పొంగి నాలుగురోజుల పాటు పెదమద్దూరు, వైకుంఠపురం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వందల ఎకరాలు నీటి మునిగి పంటలకు నష్టం వాటిల్లింది. కానీ ఆ గ్రామంలో రైతులకు పరిహారం అందక అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం అంచనా వేసిన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తమకు పరిహారం అందకుండా పోయిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాల పరిధిలో ఇంకా 50మంది వరకు పరిహారం రావాల్సి ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఈ-పంట నమోదు కాకపోవడమే కారణమా?

ఈ-పంట నమోదు చేసుకున్న వారికి పంట నష్టపరిహారం దక్కింది. నమోదు చేసుకోని వారు జాబితాలో చోటు దక్కించుకోలేకపోయారు. అధికారులు ముందస్తుగా ఈ పంట నమోదుకు రాలేదని రైతులు వాపోతున్నారు. ఈ పంట చేసిన తర్వాత ఎన్యూమరేషన్ చేసుంటే అందరికీ న్యాయం జరిగుండేది. పంటనష్ట పరిహారం లెక్కించేటప్పుడు ఏ పంట అయినాసరే 33 శాతం పైన నష్టం ఉంటేనే పరిహార జాబితాలో చేరుస్తారు. ఇదీ రైతులను దెబ్బతీస్తోంది. 33 శాతం పరిధిలోకి రాదని, నిబంధనల ప్రకారం నడుచుకుంటామని, తమ చేతిలో ఏమీ లేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విషయం తెలియక రైతులు తమను నిలదీస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులను సంప్రదించగా.. తాము మాత్రం అన్ని నిబంధనల ప్రకారమే క్షేత్రస్థాయిలో వివరాలు తీసుకుని జాబితా రూపొందించామన్నారు. 33 శాతంలోపు నష్టపోయిన వారు పరిహార జాబితాలోకి రారని వివరణ ఇచ్చారు.

20 ఎకరాలు మునిగినా పరిహారం దక్కలేదు



20 ఎకరాలు సాగు చేస్తున్నా. పదెకరాలు పత్తి, పదెకరాలు మినుము వేశా. వరదకు పూర్తిగా పంట మునిగింది. సమస్యను వ్యవసాయ సిబ్బందికి చూపించాం. పంట నష్టం జాబితాలో చేర్చుతామని చెప్పారు కానీ పరిహార జాబితాలో మాత్రం పేరు లేదు. పొలంలో ఉన్న 34 సెంట్లలో ఉన్న గేదెల ఫారానికి మాత్రమే పరిహారం ఇచ్చారు. మునిగిన పంటకు మాత్రం పరిహారం లేకుండా చేశారు.

- పాదిలె రమేష్, పెదమద్దూరు

ఎకరానికి రూ. 20వేల నష్టం



ఓర్వకల్లు చెరువు కింద పత్తి ఆరు ఎకరాల్లో సాగు చేశా. వరద ముంపునకు పూర్తిగా నష్టం వాటిల్లింది. ఎకరానికి రూ.20 వేలు చొప్పున నష్టపోయా. అధికారులు పంట నష్టాల గుర్తింపునకు వచ్చినా జాబితాలో పేరు ఎక్కించలేదు. వీఆర్వో కావాలనే మా పేరు నమోదు చేయలేదు.

- నరసింహారావు, రుద్రవరం, అచ్చంపేట మండలం

ఈ పంట నమోదు చేయక



పత్తి మూడెకరాలు, మిరప మూడెకరాల్లో వేశా. 80 సెంట్లకే ఈ-పంట నమోదు చేశారు. అధికారులు ఈ పంట నమోదు చేయకపోవడంతో పరిహార జాబితాలో నా పేరు రాలేదు. **- లక్ష్మీనారాయణ, ఓర్వకల్లు**

మినుము పూర్తిగా పోయింది



వైకుంఠపురం రెవెన్యూ పరిధిలో రెండు ఎకరాల మినుము పంట పూర్తిగా మునిగింది. దానికి సంబంధించిన పత్రాలు కూడా వ్యవసాయ సిబ్బందికి అందజేశాం. పరిహార జాబితాలో మాత్రం పేరు రాలేదు. అటు పంట మునిగి పూర్తిగా దెబ్బతిని పెట్టిన పెట్టుబడి రాక నష్టపోయా, ఇటు ప్రభుత్వం అందిస్తున్న పరిహారం అందకుండా చేశారు.

- రామ్మూర్తి కేశవ్‌నాయక్, వైకుంఠపురం

తీరనున్న వంతెన చింత

గుండ్లకమ్మ నదిపై ఏర్పాటుకు శ్రీకారం

రెండు మండలాల ప్రజలకు నెరవేరనున్న కల

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, వినుకొండ గ్రామీణ

దశాబ్దాల కల నెరవేరబోతోంది. గుండ్లకమ్మ నదిపై వంతెన నిర్మించి తమ ప్రయాణ కష్టాలు తీర్చాలని ఏళ్లుగా కోరుతున్న నూజండ్ల, వినుకొండ మండల వాసుల ఆవేదన తీరనుంది. నిధులు మంజూరవ్వడమే కాకుండా నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూజండ్ల మండలం కొత్త, పాత నాగిరెడ్డిపల్లెలు, లింగముక్కపల్లి గ్రామాలకు కూతవేటు దూరంలో వినుకొండ మండలం కొత్తపాలెం ఉంటుంది. ఈ గ్రామం మీదుగానే కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి వెళ్తోంది. ఈ మార్గంలో నిత్యం వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. అయినా నాగిరెడ్డిపల్లి వాసులు ఎంత అత్యవసరమైనా కొత్తపాలెం రాలేరు. దీనికి కారణం రెండు గ్రామాల మధ్య గుండ్లకమ్మ నది ఉండటమే. రెండు గ్రామాల మధ్యన వంతెన ఏర్పాటు చేస్తే ప్రయాణం సులువవుతోంది. మరికొన్ని గ్రామాల వారు ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమ వైపు వెళ్లాలన్నా ఇది ఉపయోగపడుతుంది. అలాంటి వంతెన కోసం దశాబ్దాలుగా ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కల సాకారమవుతోంది.


గుండ్లకమ్మ నదిని దాటుతున్న నాగిరెడ్డిపల్లె వాసులు (పాత చిత్రం)

వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయక

గుండ్లకమ్మలో నీరు తక్కువగా ఉన్నప్పుడు ఇద్దరు, ముగ్గురు కలిసి చేతులు పట్టుకుని నడుచుకుంటూ నదిని దాటుతుంటారు. ఇది ప్రమాదం అని తెలిసినా తప్పడం లేదంటారు. గతంలో ఓసారి ఇలాగే నూజండ్ల మండలంలోని కూలీలు పనులు ముగిశాక నదిలో నుంచి అవతల వైపునకు వెళ్తుండగా ఒక్కసారిగా వచ్చిన నీటి ఉద్ధృతికి ఎనిమిది మంది కొట్టుకుపోయారు. అయినా గత్యంతరం లేక అప్పుడప్పుడూ నదిని దాటుతూనే ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి కేంద్ర 60, రాష్ట్రం 40 శాతం చొప్పున నిధులు మంజూరు చేయాలి. అయితే అప్పటి వైకాపా ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయలేదు. దీంతో వంతెన నిర్మాణం ఆదిలోనే నిలిచిపోయింది. అయినప్పటికీ ఎన్నికల ముందు శంకుస్థాపన అని హడావిడి చేసి ఇనుము తెచ్చి పడేశారు. వంతెన నిర్మిస్తున్నామని ఓట్లు దండుకుందామనుకున్న వారికి ఓటర్లు గట్టిగానే సమాధానం చెప్పారు.

ఎమ్మెల్యే చొరవతో..

ఇటీవల వరద బాధితులకు సాయం అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే జీవీ వంతెన ఆగిపోయిన విషయాన్ని చెప్పారు. సమస్య విన్న సీఎం వెంటనే 40 శాతం నిధులు మంజూరు చేశారు. దీంతో 7.5 మీటర్ల వెడల్పుతో 250 మీటర్ల పొడవు గల వంతెన నిర్మాణానికి అడ్డంకులు తొలగి శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణం పూర్తయితే నూజండ్ల మండలంలోని పడమర పల్లెలు అన్నింటికీ నేరుగా కర్నూలు-గుంటూరు జాతీయ రహదారితో అనుసంధానం ఏర్పడుతుంది. ఇప్పటికే నదికి ఇరువైపులా రూ.3.65 కోట్లతో తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది.

చేసి చూపించాం

గత ప్రభుత్వ పాలకులు ఓట్ల కోసం ఈ వంతెనను ప్రచారానికి వాడుకున్నారు. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టడానికి శంకుస్థాపన చేశారు. నిధులు మాత్రం మంజూరు చేయలేదు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో వినుకొండ వాసుల కష్టాలు తీరనున్నాయి. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేశారు. వంతెనను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

700 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో 700 కిలోమీటర్ల రోడ్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. (పీ.ఎం.జీ.ఎస్.వై) కింద రూ.15.83 కోట్లతో నిర్మించనున్న వినుకొండ మండలం కొత్తపాలెం, నూజండ్ల మండలం నాగిరెడ్డిపల్లె మధ్యలో గుండ్లకమ్మ నదిపై హై లెవల్ వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. వినుకొండ శాసనసభ నియోజకవర్గంలో 100 కిలోమీటర్ల పైగా రోడ్ల నిర్మాణానికి అంచనాలు వేశారని, ఈ పథకం కింద కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులతో పనులు చేపడతారని చెప్పారు. వినుకొండ- గుంటూరు జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని సూచించారు. సహకార సంఘాల నుంచి అనేక రుణాలు పొందవచ్చని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ కొత్తపాలెం- నాగిరెడ్డిపల్లె మధ్య వంతెనలో పాటు గోకనకొండ - పువ్వాడ గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నేత నిశ్శంకరరావు శ్రీనివాసరావు, జడ్పీటీసీ సుబ్బులు, ముంద్రు సుబ్బారావు, గంగినేని ఆంజనేయులు, బాబు, మాదినేని ఆంజనేయులు, ముత్తినేని ఏడుకొండలు, పీఆర్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. పంచాయతీరాజ్ చట్టం, ఆర్‌జీఎస్ఏ యాప్ 2024-25పై ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు, డీఎల్‌పీవోలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రారంభమైంది. సీఈవో జ్యోతిబసు తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా పలు కార్యక్రమాలు విధిగా అమలు చేయాలని, స్థానిక సంస్థల ప్రతినిధులతో పాటు ప్రజలను భాగస్వామ్యం చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. శిక్షణ పర్యవేక్షకులుగా హాజరైన ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ, జిల్లా శిక్షణ మేనేజర్ కె.నాగేశ్వరరావు, డీఆర్‌పీలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక

నరసరావుపేట అర్బన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక శనివారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రతి నెలా నాలుగో శనివారం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. సెప్టెంబరు 28న అర్జీలు ఇవ్వవచ్చని తెలిపారు. షెడ్యూల్ కులాలు, తెగల ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

నీటికి తిప్పలు.. ఎన్నాళ్లీ అవస్థలు



వర్షాలు కురిశాయి.. బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉంది. అయినా తాగునీటి సమస్య తప్పడం లేదని దుర్గిలోని మారుతీ కాలనీ మహిళలు శుక్రవారం రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో ముటుకూరు అడ్డరోడ్డు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది శ్రీనివాసరావు నియంతగా మారి తమ కాలనీకి నీటిని సక్రమంగా వదలడం లేదని మండిపడ్డారు. పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని, ఇష్టమైతే నీరిస్తా.. లేదంటే వదిలేది లేదంటూ దురుసుగా సమాధానం చెబుతున్నాడన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. పరిస్థితి ఇలాగే ఉంటే కలెక్టరుకు విన్నవిస్తామని వారు పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, దుర్గి**

వయోవృద్ధులకు ఆరోగ్యంపై ధీమా

న్యూస్‌టుడే, సత్తెనపల్లి



జీవిత చరమాంకంలో వయోవృద్ధులకు వైద్య భరోసా ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. జీవనశైలిలో మార్పులు, ఆహార అలవాట్లు, శారీరక శ్రమతగ్గడంతో 40 ఏళ్లు దాటితేనే అనేకరకాల వ్యాధులు చుట్టుముడుతున్నాయి. దీనికితోడు వైద్యం ఖరీదైంది. ఈ పరిస్థితుల్లో వయోవృద్ధులు అనారోగ్యం బారినపడి ఆర్థికస్థోమత లేకుంటే అవస్థలు వర్ణనాతీతం. పేద, ధనిక తారతమ్యం లేకుండా 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేలా కేంద్రం చర్యలు తీసుకుంది. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ఆరోగ్య యోజన(ఏబీపీఎం-జేఏవై) పథకంలో 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఆరోగ్య ధీమా ఇస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. 2018 నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. కేంద్ర నిర్ణయంతో ఆదాయంతో సంబంధం లేకుండా జిల్లాలో 70 ఏళ్లు పైబడిన వారందరికి ఇది వర్తిస్తుంది.

☛ పథకంలో రూ.5 లక్షలు కుటుంబంలోని అందరికీ కలిపి వర్తిస్తాయి. ఇద్దరు 70 ఏళ్లు పైబడిన వారుంటే ఒక్కొక్కరికి రూ.2.50 లక్షలు వర్తిస్తుంది. వేర్వేరు బీమా పథకాల్లో నమోదైనా ఆయుష్మాన్ భారత్ లబ్ధి పొందవచ్చు. ☛ ఆరోగ్య బీమాను ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో సద్వినియోగం చేసుకునే సదుపాయం కల్పించారు. ప్రైవేట్ ఆరోగ్య బీమా ఉన్నవారికి సైతం పథకం వర్తిస్తుంది. ☛ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీం(సీజీహెచ్ఎస్), సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం(ఈసీహెచ్ఎస్)లాంటి ఇతర ఆరోగ్య బీమా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న వారు వాటిలోనే కొనసాగవచ్చు లేదా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఎంచుకోవచ్చు. ఐచ్ఛికాన్ని వయోవృద్ధులకే ఇచ్చారు. ☛ రాష్ట్ర ప్రభుత్వ బీమా పథకాలు పొందే వారికి సైతం వాటితో సంబంధం లేకుండానే ఆయుష్మాన్ భారత్ కింద లబ్ధి పొందవచ్చు. ☛ 2018 నుంచి ఆయుష్మాన్ భారత్ అమల్లో ఉన్నా అవగాహన చాలా తక్కువ మందికే ఉంది. వయోవృద్ధులకు పథకం అమలుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

ఇప్పటికే జిల్లాలో ఆయుష్మాన్ భారత్ కింద ఎంపిక చేసిన కుటుంబాలు 3,12,059	అందులోని మొత్తం సభ్యులు 9,86,248	70 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు సుమారు 1.80 లక్షల మంది

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం

❖ ప్రజలను వణికిస్తున్న కుక్కకాటు ❖ వచ్చే ఆరేళ్లల్లో మనుషుల్లో మరణాల నివారణే లక్ష్యం

నేడు 'ప్రపంచ రేబిస్ దినోత్సవం'

వినుకొండ, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే



జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధులలో 'రేబిస్' ప్రాణాంతకమైంది. ఏటా 18 నుంచి 20 వేల కేసులు నమోదవుతున్నాయి. అందులో 30- 60 శాతం 15 ఏళ్ల లోపు పిల్లలు దీని బారిన పడుతున్నారు. వచ్చే 2030 నాటికి రేబిస్ మరణాలు లేకుండా చేయడమే లక్ష్యంగా నిర్ణయించారు. సెప్టెంబరు, 28 ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

❖ ఈ వ్యాధి లిస్సా వైరస్ వల్ల సోకుతుంది. మనుషులు, పశువులకు ఎక్కువ శాతం కుక్క కాటు వల్ల, ఉమ్మి ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది. శరీరంపై ఉన్న గాయం మీద పిచ్చి కుక్క నాకినా, దాని చొంగ పడినా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. కుక్క కరిచిన వారం నుంచి కొన్ని నెలల్లో ఈ వ్యాధి లక్షణాలు బయటపడతాయి. కోతులు, గబ్బిలాలు, నక్కలు, ఎలుకలతోనూ సోకే అవకాశం ఉంది.

మనిషిలో రోగ లక్షణాలు

ఈ వ్యాధి వచ్చిన వారు నీళ్లను చూసి భయపడటం, శరీర కండరాల్లో విపరీతమైన నొప్పి, ప్రవర్తనలో మార్పు కనిపిస్తుంది. జబ్బు ముదిరిన కొద్దీ శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. తర్వాత వారంలో ప్రాణం పోతుంది. ఈ వైరస్ మనిషి నరాల్లో ప్రవేశించాక వ్యాధి రాకుండా ఆపడం అసాధ్యం.

కుక్కల్లో రెండు రకాలుగా..

వీటిలో రెండు రకాలుగా లక్షణాలు కనిపిస్తాయి. నాలుక బయటపెట్టి నోటి నుంచి చొంగ కారడం, మతి లేకుండా తిరగడం, కనిపించిన వస్తువులు, మనుషులు, పశువులు, కుక్కలను కరవడంతో పాటు అరుపులో మార్పు కనిపిస్తుంది. తర్వాత వారంలో చనిపోతుంది. మూగ రకాల్లో అయితే తిండి తినకుండా నిశ్శబ్దంగా ఒక్క చోటే పడుకోవడం లేదా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడం, పక్షవాతం సోకడం. తర్వాత రెండు, మూడు రోజుల్లో ప్రాణం విడుస్తుంది.



చిలకలూరిపేట మండలం బొప్పూడిలో మీదకు వస్తున్న కుక్క

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కుక్క కాటు గురైతే వెంటనే గాయాన్ని సబ్బు నీటితో కడగాలి. కట్టుకట్టకుండా వైద్యుడ్ని సంప్రదించాలి. నాటు వైద్యం, మంత్రాలకు ఇది నయం కాదు. వ్యాధి లక్షణాలు లేకున్నా మనుషులు, పశువులకు సత్వర వ్యాధి నిరోధక టీకా 0, 3, 7, 14, 28, 90వ రోజు వేయించాలి. పెంపుడు కుక్కలకు ఏటా రేబిస్ సోకకుండా టీకాలు వేయించాలి. ఊర కుక్కలకు స్థానిక ప్రభుత్వాల తోడ్పాటుతో చేయించాలి. వాటి సంఖ్య తగ్గించేందుకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయించాలి.

జిల్లాలో 28 వేల డోసులు సిద్ధం

ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా అన్ని పశు వైద్యశాలల్లో వ్యాధి నియంత్రణపైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది మన జిల్లాలో 28 వేల డోసులు రేబిస్ టీకాలు అందుబాటులో ఉన్నాయి. పెంపుడు కుక్కల యజమానులు వీటిని వినియోగించుకోవాలి. ఈ ఏడాది రేబిస్ వ్యాధి సరిహద్దులను విచ్ఛిన్నం చేయడంతో పాటు వచ్చే 2030 నాటికి మానవుల్లో ఈవ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా నిర్ణయించారు.



– కె.కాంతారావు, పశు సంవర్ధకశాఖాధికారి, పల్నాడు జిల్లా

భవితకు బాసటగా..

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్

యువతకు చిన్న పరిశ్రమలు, వ్యాపార సంస్థల ఏర్పాటుపై అవగాహన కల్పించి.. నిరుద్యోగ సమస్య రూపుమాపడమే కాకుండా ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆసక్తి ఉండి అవగాహన లేని వారి కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ సహకారంతో శిక్షణ కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని యువత కోసం నరసరావుపేటలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో మూడు రోజులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో పరిశ్రమల శాఖ, నాబార్డు అధికారులు, రిసోర్స్ పర్సన్లు యువతకు అవగాహన కల్పించారు.

☛ మూడు దశల్లో శిక్షణ కార్యక్రమాలను ఆయా సంస్థలు ఏర్పాటు చేస్తున్నాయి. వీటిలో తొలిగా ప్రాథమిక అవగాహన, రెండోదశలో ఎంచుకున్న పరిశ్రమ ఏర్పాటునకు సంబంధించిన మెలకువలపై శిక్షణ ఇస్తారు. రెండో దశలో ఐదు రోజుల పాటు శిక్షణ ఉంటుంది. అలాగే ఇప్పటికే సంస్థలు నిర్వహిస్తూ అభివృద్ధి లేకుండా ఉన్న వారికి సైతం వ్యాపారాల మెరుగుకు నిపుణులు సహకారం అందిస్తారు. తద్వారా అవగాహన పెంపొందించుకుని తమ శక్తి సామర్థ్యాలు, ఆర్థిక వెసులుబాటు పరిగణనలోకి తీసుకుని సంస్థల ఏర్పాటునకు ఆసక్తి కనపరుస్తున్నారు.

శిక్షణలో బోధించిన అంశాలివే

నిరుద్యోగులు, చిరుఉద్యోగులు నివసించే ప్రాంతాల్లో నూతన వ్యాపారాలకు ఉన్న అవకాశాలు, వాటిని ప్రారంభించేందుకు అనుమతులు, ఆర్థిక అంశాలు, రుణ సదుపాయం గురించి వివరించారు. అంతే కాకుండా వ్యాపార సంస్థలు ప్రారంభించేందుకు అనుసరించాల్సిన ప్రభుత్వ నిబంధనలు, నిర్వహించాల్సిన రికార్డులపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టుల రిపోర్టుల తయారీ, వ్యాపారాలకు సంబంధించిన అంచనాలు సిద్ధం చేయడం వంటి అంశాలు తెలియజేశారు. హాజరైన వారి నైపుణ్యాలు గుర్తించేందుకు అవసరమైన కృత్యాలు చేయించారు.

బోటిక్స్ పెడతాను



2012లో ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. తర్వాత ఉపాధి కోసం టైలరింగ్ నేర్చుకున్నా. ఎనిమిదేళ్లుగా టైలరింగ్ వృత్తిలో కొనసాగుతున్నా. అయితే చాలీచాలని ఆదాయం కుటుంబ పోషణ కష్టంగా ఉంటుంది. దీంతో టైలరింగ్‌కు సంబంధం ఉన్న బోటిక్స్ ఏర్పాటు చేసుకుంటే కొంత మెరుగ్గా ఉంటుందన్న ఆలోచనలో శిక్షణకు హాజరయ్యా. శిక్షణలో వ్యాపార సంస్థలు ఎలా ఏర్పాటు చేయాలి. అందుకు కావాల్సిన రుణ సదుపాయం, నిర్వహణలో మెలకువలు తెలుసుకున్నా. కనీసం నలుగురికి ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉంటుంది. శిక్షణ తరగతులు బాగా ఉపయోగపడ్డాయి. యంత్రం ఎక్కడ తెచ్చుకోవాలి. అందులో నాణ్యత ఎలా గుర్తించాలి వంటి విషయాలు తెలిపారు. -మల్లీశ్వరి, గుంటూరు

పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తా



2015లో డిగ్రీ పూర్తి చేశా, ఒక ఇంజినీరింగ్ కళాశాలలో చిరుద్యోగిగా పని చేస్తున్నా. వేతనాలు చాలడం లేదు. సొంతంగా వ్యాపారం పెట్టుకుందామన్న ఆలోచనతో శిక్షణకు వచ్చా. ఇక్కడ కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు అవకాశాలు వివరించారు. అలాగే యంత్రాల కొనుగోలు, ముడిసరకు లభ్యత, మార్కెటింగ్‌కు ఉన్న అవకాశాలు గురించి చెప్పారు. దీంతో పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమ పెడతామన్న ఆలోచనకు వచ్చా. అధికారులు రుణం, యంత్ర పరికరాలు కొనుగోలుకు సహకరిస్తామన్నారు. పట్టణ ప్రాంతంలో ఉన్న పోటీని నివారించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావిస్తున్నా.

- రాజశేఖర్, నరసరావుపేట

కోళ్లు తెచ్చిన తంటా

ఇద్దరికి తీవ్ర గాయాలు

దుర్గి, న్యూస్‌టుడే: కోళ్లు దొంగిలించాడన్న అనుమానంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అది గొడ్డలితో దాడి వరకు వెళ్లింది. ఇది శుక్రవారం రాత్రి ముటుకూరులో జరిగింది. బాధితుల వివరాల మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన ఏరువ లింగేశ్వరరావు, ఆనంద్ పక్కపక్కన ఇళ్లల్లో నివాసం ఉంటారు. ఆనంద్‌కు చెందిన కోళ్లను లింగేశ్వరరావు దొంగలించి, అమ్ముకుంటున్నాడని ఇద్దరి మధ్య గొడవ వచ్చింది. ఈక్రమంలో ఆనంద్ గొడ్డలితో లింగేశ్వరరావుపై దాడి చేశాడు. విషయం తెలిసిన బాధితుడి బంధువులు ఆనంద్‌పై దాడి చేశారు. అడ్డొచ్చిన ఆయన భార్య మరియమ్మను గాయపరిచారు. క్షతగాత్రులు మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

'నెలరోజుల్లోనే కాంప్లెక్స్ ఎరువుల వినియోగం'

నాదెండ్ల : విత్తనం వేశాక నెలలోపు మాత్రమే కాంప్లెక్స్ ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులు కలిపి వినియోగిస్తే పంటలకు ప్రయోజనమని జిల్లా వనరుల కేంద్ర సమన్వయకర్త శివకుమారి అన్నారు. నాదెండ్లలో రైతులకు శుక్రవారం శిక్షణ తరగతి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. క్రిమి సంహారక రసాయన మందుల్లో వేప సంబంధిత మందులు కలిపి వాడాలని, ఒకేసారి రెండు లేదా మూడు రకాల పురుగు మందులు కలిపి వాడకూడదని పేర్కొన్నారు.

గేటు పడితే అవస్థే!

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: రైలు గేటు పడిందంటే వాహనదారుల కష్టాలు వర్ణణాతీతం. కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోతుంది. రద్దీ తగ్గేవరకు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మాచర్ల నుంచి ఇటు గుంటూరు.. అటు నడికుడి వైపు రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ సమయంలో మాచర్లలో గేటు వేస్తున్నారు. ఒక్కసారి గేటు పడిందంటే.. కనీసం కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ద్విచక్ర వాహనాలు, లారీలు, ఆటోలు, బస్సులు బారులు తీరుతున్నాయి. గేటు తెరిచిన వెంటనే అడ్డదిడ్డంగా వాహనాలు వెళ్లడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో నిత్యం నరకయాతన తప్పడం లేదు. అండర్ పాసింగ్ ఏర్పాటు చేసి, ట్రాఫిక్ సమస్య తీర్చాలని వాహనదారులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



రద్దీతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

సనాతన ధర్మానికి అపచారం జరిగిందనే ప్రాయశ్చిత దీక్ష

వినుకొండ, న్యూస్‌టుడే : సనాతన ధర్మానికి అపచారం జరిగినందున మన్నించమంటూ దేవుడ్ని కోరుతూ జనసేన అధినేత కె. పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత దీక్ష చేపట్టారని ఆ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక గుంటి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు నాగశ్రీను ఆధ్వర్యంలో జన సైనికులు చేపట్టిన దీక్ష సందర్భంగా నిర్వహించిన హోమాది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ దేవుడిపైన నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరు తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించి పవిత్రమైన లడ్డూను పంచడం సంప్రదాయమన్నారు. ఆ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటంతో పాటు గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో జరిగిన అపచారాలను మన్నించాలని దీక్ష చేపట్టడం, అందులో వేంకటేశ్వరస్వామి భక్తులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. లౌకిక వాదానికి కట్టుబడి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అందరినీ ఒక్కటిగా ఆదరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

గంజాయి, అక్రమ మద్యం నియంత్రించండి

దాచేపల్లి, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గంజాయి, మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన 'పల్నాట గంజాయి గుప్పు' కథనానికి స్పందించిన ఎస్పీ శుక్రవారం ఉదయం పొందుగల చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాలు తనిఖీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గంజాయి, అక్రమ మద్యం, గ్రానైట్ రవాణాను అడ్డుకోవాలన్నారు. సీఐ వెంకట్రావు, ఎస్బీ సీఐ సురేష్‌బాబు, ఎస్సై శివనాగరాజు పాల్గొన్నారు.




సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

డ్రాగా అండర్- 23 క్రికెట్ పోటీ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న అండర్- 23 క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. పోటీల్లో భాగంగా నార్త్‌జోన్, సౌత్‌జోన్‌ల పోటీ మూడో రోజు డ్రా ముగిసింది. శుక్రవారం ఓవర్ నైట్ స్కోర్ 66 పరుగులతో ప్రారంభించిన సౌత్ జోన్ జట్టు 194 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్‌జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన నార్త్‌జోన్‌కు 9 పాయింట్లు, సౌత్‌జోన్‌కు 6 పాయింట్లు లభించాయి. నార్త్‌జోన్ బౌలరు అచ్యుత్ హేమంత్ 51 పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీసి సత్తా చాటాడు.

జేవీవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



సహాయ కమిషనర్ శ్రీనివాసరావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల దేవాదాయశాఖకు చెందిన ఆలయాల ఆభరణాలు తనిఖీ అధికారి (జేవీవో)గా డి. శ్రీనివాసరావు శుక్రవారం గుంటూరు కొత్తపేటలోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో గుంటూరు జిల్లా దేవాదాయశాఖ కార్యాలయం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. 2008లో సహాయ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆయన నెల్లూరు జిల్లా పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా, ఒంగోలు జిల్లా సహాయ కమిషనర్‌గా, తెనాలి వైకుంఠపురం దేవస్థానం లాంటి తదితర ఆలయాల్లో ఈవోగా పనిచేశారు. చివరిగా లాలాపేట వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఇటీవల జరిగిన బదిలీలో గుంటూరు జోన్ జేవీవోగా నియమించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఈవోలు, సిబ్బంది జేవీవోకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కనపర్రు తపాలా ఉద్యోగి చేతివాటం

నాదెండ్ల : మండలంలోని కనపర్రు తపాలా కార్యాలయం ఉద్యోగి చేతివాటం చూపించాడు. బాధితుల వివరాల మేరకు.. పొదుపు ఖాతాదారులు చెల్లిస్తున్న పోస్టల్ ఆర్డీ, డిపాజిట్ల సొమ్మును జేబులో వేసుకున్నాడు. కాల పరిమితి ముగిసినా సొమ్ము తిరిగి ఇవ్వకపోవడం అనుమానాలకు దారి తీసింది. దీనిపై ఉద్యోగిని నిలదీశారు. గతంలో ఇక్కడ పనిచేసిన బట్వాడా ఉద్యోగి కూడా ఇలాగే చేసినట్లు బాధితులు వాపోతున్నారు. ఉన్నతాధికారులకు ఆదేశం మేరకు తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్లు కోటేశ్వరరావు (సత్తెనపల్లి), ప్రసాదు (వినుకొండ), సురేష్ (చిలకలూరిపేట) శుక్రవారం విచారణ నిర్వహించారు.

గడువులోగా రిటర్నులు సమర్పిస్తే పన్ను రాయితీ


నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : సహకార సంఘాలకు పన్ను రాయితీ రావాలంటే నిర్ణీత గడువులోగా రిటర్నులు సమర్పించాలని ఆదాయ పన్ను శాఖ అధికారి ఎం.రామశాస్త్రి అన్నారు. స్థానిక జిల్లా కో- ఆపరేటివ్ బ్యాంక్ కార్యాలయంలో ఆదాయ పన్నుపై శుక్రవారం జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వెంకటరమణ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. రామశాస్త్రి మాట్లాడుతూ ఆదాయపు పన్ను దాఖలు చేయడంలో గడువు దాటితే సెక్షన్ 80 పీ కింద రాయితీ వర్తించదని తెలిపారు. ఆదాయపు పన్ను కార్యాలయం నుంచి వచ్చే తాఖీదులకు స్పందించి సమాధానం ఇవ్వాలన్నారు. జిల్లాలోని 59 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సభ్యులు హాజరయ్యారు. జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి డి. శ్రీనివాసరావు, ఆదాయపు పన్ను సూపరింటెండెంట్ అమానుల్లా, జీడీసీసీబీ మేనేజర్ రమాదేవి పాల్గొన్నారు.

హథీరాంజీ ట్రస్టు భూములు కాపాడాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: తిరుపతిలో బంజారాల దైవం హథీరాంజీ ట్రస్టు భూములను వైకాపా నేతల ఆక్రమణల నుంచి కాపాడాలని తెదేపా రాష్ట్ర ఎస్టీ విభాగం అధ్యక్షుడు ఎం. ధారూనాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా తెదేపా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రస్టు భూములు 350 ఎకరాలు యథేచ్ఛగా ఆక్రమించారని తెలిపారు. అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మధుసూదనరెడ్డి ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయించారని పేర్కొన్నారు.

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా తమ్మాజీరావు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా తమ్మాజీరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా బాపట్ల నుంచి నరసరావుపేటకు వచ్చారు. ఇప్పటి వరకు నరసరావుపేటలో విధులు నిర్వహించిన సంజీవరావును గుంటూరుకు బదిలీ చేశారు. ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.



బ్రాయిలర్ ధరలు (కిలో ।కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

నిబంధనల మేరకు పరిహారం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జాతీయ రహదారుల నిర్మాణానికి భూమి ఇచ్చి రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అన్నారు. రొంపిచర్లలో విప్పర్ల, మాచవరం గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. 167ఏ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలు నమోదు చేశారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపుతామని పేర్కొన్నారు. రైతులకు నిబంధనల మేరకు పరిహారం అందజేస్తామని చెప్పారు. ఆర్డీవో సరోజిని, అధికారులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



నీటి శుద్ధి కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డైరెక్టరు శౌరిరెడ్డి

శావల్యాపురం, న్యూస్‌టుడే : మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చుకోవాలని నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శుక్రవారం శావల్యాపురం మండలం కనమర్లపూడి, ముంద్రువారిపాలెంలో బాలవికాస్- ఇరిడా, ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో కలిసి ఆయన ప్రారంభించారు. సంస్థ డైరెక్టరు సింగారెడ్డి శౌరి రెడ్డి, సంస్థ ఎగ్జిక్యూటివ్ మేనేజరు ఎ. మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, సర్పంచి తన్నీరు భారతి, తెదేపా నేతలు పాల్గొన్నారు.

నిధులు కేటాయించరూ..

మండలంలోని చినకంచర్ల నుంచి పొలాలకు వెళ్లే దారులు అధ్వానంగా ఉన్నాయని, గ్రామస్థులు ఎంపీ, ఎమ్మెల్యేకు తెలిపారు. శుక్రవారం గ్రామానికి వచ్చిన వారికి ప్రజలు సమస్యలు తెలిపారు. గ్రామం నుంచి పిట్టంబండ వెళ్లే మార్గం, దండుబాట ఇబ్బందిగా ఉన్నాయని పేర్కొన్నారు. స్పందించిన ఎంపీ రోడ్లను బాగు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం, పశువైద్యశాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరగా, ఎమ్మెల్యే తన నిధులు ఇస్తానని చెప్పారు.

శావల్యాపురం : గుంటూరు- గుంతకల్లు డబ్లింగ్ పనుల వల్ల శావల్యాపురం రైల్వేస్టేషన్‌కు సమీపంలోని తలుపుల వాగు పంట కాల్వ పూర్తిగా పూడిపోయిందని, దీని వల్ల 500 ఎకరాలకు సాగునీరు అందక బీడు భూములుగా మారాయని రైతులు ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాల్వ నిర్మాణానికి స్థలం ఇవ్వడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని, అయితే లైనింగ్ కాల్వ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని గ్రామ పెద్దలు కోరారు.

వార్డుల్లో పనులు చేసేదెప్పుడు?

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆక్రోశం

వినుకొండ, న్యూస్‌టుడే : గెలిచి మూడున్నర ఏళ్లు అయింది.. ఇప్పటి వరకు వార్డుల్లో చేసేందేమీలేదని పలువురు కౌన్సిలర్లు ఆక్రోశం వెల్లగక్కారు. ఛైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో గంటా కాలేషా మాట్లాడుతూ 14వ వార్డులో నాలుగు పనులు చేయాలని కోరినా ఇప్పటి వరకు మొదలు కాలేదన్నారు. 19వ వార్డు కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా కోతులు, కుక్కల బెడద ప్రస్తావిస్తే పట్టించుకోలేదని, చివరకు నిర్మలా పాఠశాల వద్ద డ్రైనేజీ తీయాలని కోరినా స్పందన లేదన్నారు. మున్సిపల్ ఏఈ దేవి వివరణ ఇస్తూ పాఠశాల పురపాలక సంఘ పరిధిలో లేనందున ఆ పని చేపట్టలేదన్నారు. మూడున్నర ఏళ్లుగా పురపాలక సంఘ నిధులతో ఏ పనులు చేశారో జాబితా ఇవ్వాలని, నిధులు ఎటు పోతున్నాయో అర్థం కావడం లేదని 23వ వార్డు కౌన్సిలర్ నన్నేషా ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి పెద్దల ఒత్తిడితో ఇతర పనులకు డబ్బులు బదలాయిస్తుంటే ఎవరూ నోరు మెదపలేదు.. ఇప్పుడేమో పనులు కాలేదని మాట్లాడుతున్నారని, డబ్బులు లేకుండా ఏం చేయలేమని ఛైర్మన్ దస్తగిరి పేర్కొన్నారు. నరగాయకుంట వద్ద మాంసం మార్కెట్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై తొమ్మిదో వార్డు కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ అభ్యంతరం చెప్పారు. అక్కడ హిందూ ఆరామక్షేత్రం నిర్మించాలని గతంలో ప్రతిపాదించారని, ఇప్పుడు మార్కెట్ ఏర్పాటు చేస్తామంటే ఎలా అనడంతో కమిషనర్ సుభాష్ చంద్రబోస్ జోక్యం చేసుకొని ఈ అంశాన్ని వాయిదా వేస్తామని హామీ ఇచ్చారు. 8వార్డు కౌన్సిలర్ పాపసాని బ్రహ్మయ్య ఇతర సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించారు.

29న ఉచిత మెగా వైద్య శిబిరం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆదివారం వైద్యశాలలో శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఇంటర్వెన్షల్ కార్డియాలజిస్టు డాక్టర్ కోట శబరి గిరీష్ ఆధ్వర్యంలో ఓపీ, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు ఉచితంగా చేస్తారు. 45 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు ఆరు నెలలకు ఒకసారి గుండె పనితీరును పరీక్షించుకోవాలని వైద్యులు తెలిపారు.

అక్రమాలకు పాల్పడ్డ సర్వేయర్లపై విచారణ చేయాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో రీసర్వే పేరుతో అక్రమాలకు పాల్పడి రైతులకు అన్యాయం చేశారని పీడీఎం నేతలు వై. వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు పేర్కొన్నారు. రీసర్వే, ఎల్‌పీ నంబర్లను రద్దు చేయాలని సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. జొన్నలగడ్డ సర్వేయర్ కోమటినేని రామాంజనేయులు, వినుకొండ సర్వేయర్ రవికుమార్, బ్రాహ్మణపల్లి వీఆర్వో బ్రహ్మారెడ్డి, సర్వేయరు అనితారెడ్డి భారీ అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఒకరి భూములను మరొకరి పేరుతో రికార్డుల్లోకి ఎక్కించారని అన్నారు. దీనిపై అధికారులు విచారణ జరిపించాలని వారు కోరారు.

ఆటేదైనా మేం దీటే

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

• రాణిస్తున్న రాజాపేట విద్యార్థులు • పలు పోటీల్లో పతకాలు


పరుగు సాధన చేస్తూ..

వారంతా పేద విద్యార్థులు.. ప్రతిభతో గురుకుల పాఠశాలల్లో చేరి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, పీఈటీ సహకారంతో జిల్లాస్థాయిలో 81 మంది విద్యార్థులు ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తా చాటారు. వారే చిలకలూరిపేట మండలం రాజాపేట సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు. పరుగు పందెం అన్ని విభాగాలు, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, జావలిన్‌త్రో, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, కబడ్డీ, ఖోఖో, చెస్, వాలీబాల్, యోగా పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. గతేడాది పదో తరగతిలోనూ నూరు శాతం ఫలితాలతో ముందంజలో నిలిచారు.

అన్నింటిలోనూ ముందంజ



ఇటీవల జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో షాట్‌పుట్, జావలిన్ త్రో, డిస్కస్‌త్రో పోటీల్లో మొదటి స్థానం సాధించాం. రాష్ట్రస్థాయిలో కూడా ఎంపికై సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాం. నాకు క్రీడలంటే ఇష్టం. అందుకే నిరంతరం సాధన చేస్తున్నా. **– నాగరాజు, నీలయ్య, 10వ తరగతి**

పరుగు పందెంలో అన్ని విభాగాల్లో..



ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పరుగు పందెం అన్ని విభాగాల్లో రాజాపేట గురుకుల పాఠశాల విద్యార్థులమే ఉన్నాం. 100, 200, 400 మీటర్ల పరుగు పందెంలో పాటు రిలే పోటీల్లో మొదటి స్థానం సాధించాం. వీటితో పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో సత్తా చాటాం.

– సాయిరామ్, వంశీనాయక్, 10వ తరగతి

యోగాలోనూ మొదటి స్థానమే



యోగాలో అన్ని విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచాం. దీంతోపాటు షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, పరుగులో మొదటి, రెండో స్థానంల్లో నిలిచాం. రాష్ట్రస్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాం.

– జశ్వంత్, చంద్రశేఖర్, 10, 9వ తరగతులు

సమష్టి కృషితో సాధ్యం



రాజాపేట గురుకుల పాఠశాలను చదువులోనూ, క్రీడల్లోనూ జిల్లాలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ముందంజలో ఉండేందుకు సమష్టిగా కృషి చేస్తున్నాం. దీని కోసం ప్రత్యేక తరగతులతో పాటు క్రీడల్లోనూ శిక్షణ ఇస్తున్నాం. వ్యాయామోపాధ్యాయుడు రాజు ఇస్తున్న శిక్షణతోనే జిల్లాస్థాయి పోటీల్లో 81 మంది విద్యార్థులు సత్తా చాటారు. ఇదే ఒరవడిని రాష్ట్రస్థాయిలోనే కొనసాగిస్తాం. **– ఎన్.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్**

అనుభవాలే ఆయన అక్షరాలు

నేడు కవి జాషువా జయంతి

వినుకొండ, న్యూస్‌టుడే


జాషువా

అనుభవాలే అక్షరాలుగా మలిచి అద్భుతమైన సాహిత్యాన్ని అందించిన మహాకవి గుర్రం జాషువా. సుకవి జీవించు ప్రజల నాల్కల మీద అన్నట్లు నేటికీ ఆయన జీవించే ఉన్నారు. గుర్రం వీరయ్య, లింగమ్మలకు 1895 సెప్టెంబరు 28న వినుకొండలోని మిసమ్మ తోటలో జన్మించారు. ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత ఆకాశవాణిలో ప్రొడ్యూసర్‌గా పని చేసిన ఆయన 1964 శాసనమండలి సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. తల్లిదండ్రులది కులాంతర వివాహం కావడంతో బాల్యంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. నాడు ఆయన చవిచూసిన అవమానాల నుంచే ఆయన కవిత్వం పుట్టింది. ఆయన రాసిన గబ్బిలం ప్రాచుర్యం పొందింది. క్రీస్తు చరిత్ర కావ్యానికి కేంద్ర సాహిత్య అవార్డు లభించింది. ఆయన అందుకున్న బిరుదులు అనేకం.. రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చేతుల మీదుగా పద్మభూషణ్ అందుకున్నారు.

★ స్మారక మందిరం అవశ్యం

ఆయన పుట్టిన వినుకొండలో స్మారక మందిరం ఏర్పాటు చేయాలని ఆయన అభిమానుల కోరిక. పురపాలక సంఘంలో ఆయన పేరుతో కళాకేంద్రం ఉన్నా ప్రజలకు పెద్దగా ప్రయోజనం లేదు. దాని ముందు ఇటీవల ఆయన అభిమానులు కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఎన్నెస్పీ కాలనీ స్థలంలో గతంలో జాషువా కళాతోరణం నిర్మించేందుకు శంకుస్థాపన చేసినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా కవి జాషువా పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, న్యూస్‌టుడే: పేద విద్యార్థుల కోసం రూ. కోట్ల వ్యయంతో నిర్మించిన యడ్లపాడు మండలం వంకాయలపాడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అధికారులు మెరుగైన బోధన, మెనూ ప్రకారం ఆహారం, వసతి సౌకర్యాలు అందించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఇటీవల ఆ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు గోడ దూకి పారిపోయిన నేపథ్యంలో శుక్రవారం ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 7, 8, 9, 10 తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో సమస్యలు చెప్పడానికి వారు భయపడుతుండగా.. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, వాస్తవాలు వెల్లడించాలని భరోసా ఇచ్చారు. దీంతో విద్యార్థులు సమస్యలు ఏకరవు పెట్టారు. నాణ్యమైన ఆహారం, మంచినీరు ఇవ్వడం లేదని, గడువు తీరిన సరకులు వాడుతున్నారని, మరుగుదొడ్లు శుభ్రంగా లేవని చెప్పారు. భయపెట్టి తిట్టి కొడుతున్నట్లు చెప్పారు. రోగాలు బారిన పడ్డా తల్లిదండ్రులను అనుమతించటం లేదని తెలిపారు.

ప్రిన్సిపల్‌ను వేరే పాఠశాలకు బదిలీ చేయాలని ఆదేశం

అనంతరం ఎమ్మెల్యే వంటశాలను సందర్శించారు. ఉడికిన అన్నం పట్టుకుని పరిశీలించారు. మెత్తబడి ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం నిర్వాహకులు తమను బెదిరిస్తున్నారని విద్యార్థులు చెప్పటంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే ఇంటికి వెళతారని హెచ్చరించారు. ప్రిన్సిపల్ హనుమంతరావు, వైఎస్ ప్రిన్సిపల్ శిరీష్‌బాబు స్థానికంగా ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు. స్థానికంగా ఉండని ప్రిన్సిపల్‌ను వేరే పాఠశాలకు బదిలీ చేయాలని ఆదేశించారు. జనసేన నేత తోట రాజారమేష్, తెదేపా మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు, పార్టీ నేతలు, చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్సై బాలకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలపై చర్చించేందుకు తీరిక లేదేమో?


సమావేశంలో ఖాళీగా కుర్చీలు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : రొంపిచర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం కోరం లేక ఆగింది. మండలంలో 18 మంది ఎంపీటీసీలు, ఒక కో- ఆప్షన్ సభ్యుడికి గాను ఎంపీపీ మాత్రమే హాజరు కావడం, మిగిలిన ప్రజాప్రతినిధులు రాక సమావేశం నిలిచింది. మండలంలో సమస్యలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సమావేశం కోరం లేక ఆగిపోవడం చర్చగా మారింది.

కూలేలోపు సరి చేయండి


ఒరిగిన విద్యుత్తు స్తంభం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : వినుకొండ మండలం జాలలపాలేనికి విద్యుత్తు సరఫరా చేసే ప్రధాన లైన్‌లో విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగి కూలేందుకు ఉంది. కొన్ని రోజులుగా ఇలాగే ఉన్నా ఆ శాఖాధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు తెలిపారు. విద్యుత్తు ఉన్న సమయంలో ఇది కూలితే గడ్డివాములు ఉన్నందున పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాపోయారు. ఆ శాఖాధికారులు స్తంభాన్ని సరి చేయాలని కోరుతున్నారు. దీనిపై ఏడీఏ కిరణ్‌బాబును అడుగగా.. రెండో శనివారం విద్యుత్తు సరఫరా ఆపినపుడు సరి చేస్తామని పేర్కొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే


లబ్ధిదారులతో ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 మందికి వైద్యం ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫార్సు చేయగా ఆరుగురికి రూ. 5.91 లక్షల చెక్కులు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి త్వరలోనే సాయం అందుతుందని వివరించారు. తెదేపా నేతలు కపలవాయి విజయ్‌కుమార్ ఉన్నారు.

పౌష్టికాహార, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు



పౌష్టికాహార ప్రదర్శనలో గర్భిణులు, బాలింతలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ పోషణ అభయాన్‌లో భాగస్వామ్యమై శక్తివంతమైన భావితరాలను నిర్మించాలని ఎమ్మార్సీ ప్రభాకరరావు అన్నారు. అందుగులపాడు, శివాపురం, వితంరాజుపల్లి, తిమ్మాయిపాలెం, నాగులవరం, పిట్టంబండ, నడిగడ్డలో పౌష్టికాహార మాసోత్సవాలు, స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ని పరిశీలించి గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలకలూరిపేట పట్టణం : స్థానిక ఆది ఆంధ్రా కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం అవి తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హనుమాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవధపై కేసు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : బొప్పూడి సమీపంలో బైపాస్ పక్కన షెడ్డు ఏర్పాటు చేసుకుని గోవధ చేస్తున్నారన్న సమాచారంతో గ్రామీణ పోలీసులు శుక్రవారం హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. అప్పటికే ఒక ఆవును వధ చేశారు. మరో రెండు ఆవులు వధకు సిద్ధంగా ఉన్నాయి. వెంటనే రెండు ఆవులను పసుమర్రులోని గోశాలకు తరలించారు. పట్టణంలోని ఆది ఆంధ్రా కాలనీలో నివాసం ఉంటున్న నందిగం రాజు పశువధకు సంబంధించి అనుమతి పొంది.. గోవధ చేస్తున్నారని పోలీసులు గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

చర్చిలో యాంప్లిఫ్లయర్లు చోరీ

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : రొంపిచర్ల చెరువుకట్ట ప్రాంతంలో ఉన్న యేసు మహిమ ప్రార్థన మందిరంలో యాంప్లిఫ్లయర్లు చోరీకి గురయ్యాయి. దీనిపై పాస్టర్ పాల్‌రాజ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాంప్లిఫ్లయర్లు అమ్మకానికి వచ్చినట్లయితే 9949395248 సమాచారం అందించాలని పాస్టర్ కోరారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగ్గురి అరెస్టు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు గ్రామీణ ఎస్సై కిషోర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కేసానుపల్లి పంచాయతీ లలితాదేవి కాలనీలో శుక్రవారం వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు గ్రామీణ ఎస్సై తన సిబ్బందితో వ్యభిచార స్థావరంపై దాడి చేసి మస్తాన్‌వలితో పాటు మరో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

గంజాయి స్వాధీనం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన ఉప్పుతోల తిరుపతయ్య గంజాయి విక్రయిస్తుండన్న సమాచారంతో అరెస్టు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు శుక్రవారం తెలిపారు. అతని వద్ద నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఏపీ ఇవీ

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని గోపాళంవారిపాలెంలో గ్రామానికి చెందిన వైద్యుడు నరసరావుపేటలోని తేజ నర్సింగ్‌హోమ్ అధినేత బొట్ల రఘుప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు.

గనులు, భూగర్భ శాఖ జిల్లా అధికారి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన నాగయ్య

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : గనులు భూగర్భ శాఖ జిల్లా అధికారిగా (ఏడీ) యంపరాల నాగయ్య నియమితులయ్యారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ స్థానంలో ఇప్పటి వరకు పనిచేసిన నాగిని బనగానపల్లెకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఏడీని కార్యాలయ సిబ్బంది, మైనింగ్ నిర్వాహకులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిసి అభినందించారు.

దేవాలయాల కార్యనిర్వహణ అధికారిగా...

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేట, కొమరవల్లిపాడు గ్రూపు దేవ స్థానాలకు సంబంధించి కార్యనిర్వాహణ అధికారి శుక్రవారం బి.అశోక్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. వీటితో పాటు బాలకోటేశ్వరస్వామి దేవస్థానం (అమృతలూరు మండలం గోవాడ) కూడా అదనపు బాధ్యతలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత గ్రహణ మొర్రి పరీక్షలు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్, బసవ తారకం ఛారిటబుల్ ట్రస్టు, క్యాన్సర్ హాస్పిటల్‌ల ఆధ్వర్యంలో మండలంలోని లింగంగుంట్లలోని శంకరభారతీపురం పాఠశాలలో శుక్రవారం ఉచిత గ్రహణ మొర్రి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రాజేష్, జోషి, రాష్ట్ర సహాయ సమన్వయ కర్త మల్లికార్జున్ పాల్గొని పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఏడుగురు పిల్లలను హైదరాబాద్ హాస్పిటల్‌కు పంపిందుకు సిఫార్సు చేశామని, వారికి ఉచిత శస్త్రచికిత్స, రవాణా ఖర్చులు అందజేస్తారని వైద్యులు తెలిపారు.

ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందే

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే : చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామంలో ఉయ్యాల ఏడుకొండలు ఇంటిని కూల్చి కులం పేరుతో దూషించి అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసును డీఎస్పీ నీరుగార్చాలని చూస్తున్నారని, ఆయన స్థానంలో వేరొకరిని నియమించి విచారణ జరిపించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో హోంలో శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడుతూ గత నెల 18న అధికార పార్టీ నాయకుల అండదండలతో తన్నీరు గోవిందరాజు, అతని అనుచరుడు ఏడుకొండలు ఇంటిని కూల్చి ఆ శిథిలాలను వాగులో పారబోశారన్నారు. బాధితులకు న్యాయం చేయకపోగా బాధితులపై వీరి ఫిర్యాదు మేరకు గ్రామీణ ఎస్సై కేసు నమోదు చేశారని, వెంటనే ఏడుకొండలు ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణ, కొండారెడ్డి, పోతురాజు, సాంబయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నరసరావుపేట సెంట్రల్ : రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణ శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలు తొలగించడం చేశారు. అనంతరం స్వర్ణాంధ్ర విజన్- 2047 పై వ్యాసరచన పోటీలు పెట్టారు. ప్రధానోపాధ్యాయులు సుభాని పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి


మొక్క నాటుతున్న అధికారులు, సిబ్బంది

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, పంచాయతీ అధికారులు తెలిపారు. స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. పచ్చదనం, పరిశుభ్రత లింగంగుంట్లగా తీర్చిదిద్దామన్నారు. పరిసరాలు శుభ్రం ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గంగుల పెద్దిరెడ్డి, కార్యదర్శి ప్రసాద్, హెచ్ఎం పార్వతి, పీడీ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శుల నియామకం

శావల్యాపురం : మండలంలోని పలు గ్రామాలకు గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులను నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో బొందిలిపాలెం కార్యదర్శిగా నరసరావుపేట మండలం చిన తురకపాలెంలో విధులు నిర్వహిస్తున్న షేక్ సైదాబి, కొత్తలూరుకు పమిడిమర్రులో పని చేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావు, వయ్యకల్లుకు నకరికల్లు మండలం శివాపురం తండా కార్యదర్శి వరికూటి సైదారెడ్డి, చినకంచర్లకు లలిత శ్రీవల్లి, ముంద్రువారిపాలేనికి చిలకలూరిపేట మండలం మద్దిరాలలో పని చేస్తున్న జి.వాసు, ఇర్లపాడుకు యడ్లపాడు మండలం కోట నుంచి కూరపాటి రబ్బానిని నియమించారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తా

నరసరావుపేట సెంట్రల్ : నరసరావుపేట ఎంపీడీవోగా కె.వి. కృష్ణకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇప్పటి వరకు ప్రకాశం జిల్లాలో పనిచేశారు. బదిలీపై నరసరావుపేటకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వరరావు ఫిరంగిపురానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక గడియార స్తంభం కూడలి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పురపాలిక ఛైర్మన్ ఎస్‌కే రఫానీ శుక్రవారం పరిశీలించారు. ఎక్కడా లేని విధంగా పట్టణంలో మూడు క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ఘనత ఎమ్మెల్యే పుల్లారావుకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.

నిలిచిన ఇళ్ల నిర్మాణాలు పూర్తికి అవకాశం

నూజండ్ల : గృహ నిర్మాణానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీనివాసరావు అన్నారు. నూజండ్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. గత ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. మార్చిలోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, ఏఈ యలమంద ఉన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

యడ్లపాడు : స్వర్ణాంధ్ర- 2047 విజన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి వక్తృత్వ, వ్యాస రచన, అంశాలపై చర్చ పోటీలు నిర్వహించారు. మూడు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

ఆగిన చదువు కొనసాగించండి

నూజండ్ల : మధ్యలో ఆగిన చదువు కొనసాగించడానికి సార్వత్రిక విద్యాపీఠం అవకాశం కల్పిస్తున్నట్లు రాష్ట్ర- సమన్వయకర్త అక్బర్ అలీ అన్నారు. శుక్రవారం నూజండ్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కేంద్రాన్ని ప్రారంభించారు. 14 ఏళ్లు నిండినవారు పదో తరగతి, ఇంటర్ చదివేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఈవో రవిచంద్ర, సహాయ సమన్వయ కర్త చినరామయ్య, హెచ్. శ్రీనివాసరావు, రాజేష్ పాల్గొన్నారు.

పర్యాటకానికి నిలయం అమరావతి


సభలో మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

అమరావతి, న్యూస్‌టుడే: అమరావతిలో అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటి ద్వారా చారిత్రక విషయాలు ఎన్నో తెలుసుకోవచ్చని ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. అమరావతిలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధ్యానబుద్ధ వద్ద జరిగిన సభలో ఆర్డీవో మాట్లాడారు. అమరావతిలోని ధ్యాన బుద్ధ ప్రాజెక్టు, ధ్యానబుద్ధ వనం, మ్యూజియం, మహా చైత్యం వంటి సందర్శన స్థలాలు ఎంతో ఆకర్షించేలా ఉన్నాయన్నారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, మేనేజర్ మణికుమార్, ఎంపీడీఓ శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ నూతన సబ్ రిజిస్ట్రార్‌గా బి.అశోక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గురజాల నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ దేవానంద్ దుగ్గిరాలకు బదిలీపై వెళ్లారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రాధాకృష్ణమూర్తి, వెంకటరమణ తదితరులు సబ్ రిజిస్ట్రార్ అశోక్‌ను సత్కరించారు.

ఈవోగా పూర్ణచంద్రరావు

గురజాల, న్యూస్‌టుడే: గురజాల (గ్రూపు) ఆలయాల నూతన కార్యనిర్వహణాధికారిగా పూర్ణచంద్రరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. దైద, పాతపాటేశ్వరి అమ్మ వారి ఆలయాలకు ఈవోగా ఆయన వ్యవహరించనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? పెదకూరపాడు 2వ వార్డులోని మన్నవ వీరయ్య మాస్టారు బజారులో విద్యుత్తు స్తంభాలు దెబ్బతిని, ప్రమాదకరంగా మారాయి. తీగలు కిందకు వేలాడుతున్నాయి.
- కరణం శ్రీను, స్థానికుడు

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. వారం వ్యవధిలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం.
- రామకృష్ణ, ఏఈ, విద్యుత్తు శాఖ, - న్యూస్‌టుడే, పెదకూరపాడు

? అంజనాపురంలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. దోమలు, దుర్వాసనతో అల్లాడుతున్నాం. అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయించాలి. **- స్థానికులు**

✔ ఇప్పటికే పంచాయతీలోని మురుగు కాలువలు శుభ్రం చేశాం. తరచూ శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.
- మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి, మాదుగుల, - న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

? జానపాడు- పందిటివారిపాలెం గ్రామాల మధ్య రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా ఉంది.
- సత్యం, జూలకల్లు

✔ వచ్చే నెలలో రెండు గ్రామాల మధ్య రహదారి మరమ్మతుల పనులు ప్రారంభిస్తాం. **- ఆర్‌అండ్‌బీ జేఈ , - న్యూస్‌టుడే, పిడుగురాళ్ల**

? కోతిమూకల సెంటర్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది.
- కుమారి, గురజాల

✔ కుక్కలను పట్టుకుంటాం. **- మహ్మద్ ఖాసిం, ఇన్‌ఛార్జి కమిషనరు - న్యూస్‌టుడే, గురజాల**

? తక్కెలపాడులో పలు వీధుల్లోని మురుగు కాలువలో పూడికలు, పిచ్చి చెట్లు పెరగడంతో మురుగు నీరు రోడ్ల పైకి చేరుతున్నాయి.
- కార్తీక్, స్థానికుడు

✔ పంచాయతీ సిబ్బందిని పంపి మురుగు కాలువలో పూడికలు, పిచ్చి చెట్లు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
- లక్ష్మీనారాయణ, సర్పంచి - న్యూస్‌టుడే, దాచేపల్లి

రహదారులకు మోక్షం

రూ.11 కోట్ల నిధుల కేటాయింపు

పెదకూరపాడు, న్యూస్‌టుడే


ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ పాలనలో రహదారులకు గ్రహణం పట్టింది. గుంతలు, రాళ్లు తేలి, ఎగుడు దిగుడుగా మారినా పట్టించుకోలేదు. రాకపోకలకు ప్రయాణికులు నరక యాతన పడినా కనికరించలేదు. ముఖ్యంగా అంతర్గత రహదారులు, గ్రామాలను కలిపే బీటీ రోడ్లను పూర్తిగా గాలికొదిలేసింది. ప్రధాన రహదారులను సైతం పట్టించుకున్న పాపాన పోలేదు. చిరుజల్లులు పడినా బురదమయంగా మారి, గుంతల్లో నీళ్లు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. తాజాగా కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టి సారించింది. అందులో భాగంగా రహదారులు బాగు చేయించేందుకు నిధులు కేటాయించింది.


జలాల్‌పురం-కంభంపాడు రహదారి

ప్రగతికి బాట

పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సిమెంటు, తారు రోడ్లు నిర్మించేందుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రూ.11 కోట్ల నిధులు మంజూరు చేయించారు. అమరావతి మండలం మండెపూడి నుంచి నెమలికల్లు వరకు రూ.2 కోట్లతో బీటీ రహదారి, మునగోడు నుంచి అత్తలూరుకు రూ.2 కోట్లు, గుంటూరు అమరావతి రహదారిలో ఎనికపాడు బీటీ రోడ్డుకు రూ.కోటి, చంద్రాజుపాలెం-పాపాయపాలెం రహదారి నిర్మాణానికి రూ.1.5 కోట్లు, పీసపాడు తాళ్లూరు నుంచి గుడిపాడు వరకు నిర్మాణానికి రూ.కోటి, కంభంపాడు నుంచి పసన మీదుగా జలాల్‌పురం వరకు జడ్పీ రహదారికి రూ.1.5 కోట్లు, పెదకూరపాడు అంబేడ్కర్ బొమ్మ సెంటర్ నుంచి పాల కేంద్రం వరకు సీసీ రోడ్డుకు రూ.50 లక్షలు, అమరావతిలో కాలువల నిర్మాణానికి రూ.50 లక్షలు, కొత్తపల్లి, బయ్యవరం, కాశిపాడు, వెంకటాయపాలెం, పాపాయపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లకు రూ.20 లక్షల చొప్పున, కాలువల నిర్మాణానికి రూ.కోటి నిధులు కేటాయించారు. దీంతో రహదారుల రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికుల కష్టాలు తొలగనున్నాయి.

సీఎం సహాయనిధికి రూ.4 లక్షలు అందజేత


సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న బీమా ఏజెంట్ల సంఘ నాయకులు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: జీవిత బీమా సంస్థ మచిలీపట్నం డివిజన్ పరిధిలోని ఏజెంట్ల సంఘం (లియాఫి) నాయకులు వరద బాధితుల సహాయ నిధికి రూ.4 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు శుక్రవారం అందించారు. సత్తెనపల్లి శాఖ సంఘం ఆధ్వర్యంలో ఏజెంట్ల ద్వారా విరాళాల సేకరణకు మొదట శ్రీకారం జరిగింది. ఈ మేరకు డివిజన్‌లోని అన్ని శాఖల్లో విరాళాలు సేకరించారు. చెక్కు అందించిన వారిలో సంఘం డివిజన్ అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కార్యదర్శి రవీంద్రరెడ్డి, కోశాధికారి పి.జగన్నాథం, సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు మంచాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం

మాచర్ల (కారంపూడి) : మాచర్ల విద్యుత్తు ఈఈగా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న హరిబాబును శుక్రవారం విద్యుత్తు అధికారులు ఘనంగా సన్మానించారు. స్థానిక విద్యుత్తు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు సందీప్‌కుమార్, చంద్రశేఖర్, ఆశీర్వాదం, వీరేశ్వరరావు, భగవాన్, నాగేశ్వరరావు, వసంతలక్ష్మి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వాయిదాలకు హాజరుకండి

మాచవరం, న్యూస్‌టుడే : వివిధ కేసుల్లోని నిందితులు తప్పనిసరిగా కోర్టు వాయిదాలకు హాజరు కావాలని ఎస్సై సతీష్ కోరారు. నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్న గోవిందాపురం, కొత్తపాలెం, బ్రహ్మణపల్లికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన చెప్పారు.

హోరా హోరీ పోరు


కుస్తీ పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: స్థానిక బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కుస్తీ పోటీల జిల్లా జట్ల ఎంపిక జరిగింది. ఇందులో గురుకుల పాఠశాల విద్యార్థులు తొమ్మిది మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అరుణకుమార్ తెలిపారు. అండర్-19 విభాగంలో రామ్‌మనోహర్, సిద్ధార్థ, శ్రీకాంత్, కల్యాణ్, చంటి, అబ్దుల్, సూర్య, భరత్, సాంబశివరావు ఎంపికైనట్లు వివరించారు. జిల్లా స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు నలుగురు ఎంపికయ్యారన్నారు.

అచ్చంపేట: స్థానిక జడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి అండర్ 14, 17 బాలబాలికల వాలీబాల్, కబడ్డీ, యోగాసనాల పోటీలు జరిగాయి. పోటీలను స్థానిక జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని సి.కల్యాణి, పోటీల నియోజకవర్గ కన్వీనర్ నాగరాజు ప్రారంభించారు. వివిధ మండలాలకు చెందిన 400మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

అమరావతి: అమరావతిలోని బాలికల గురుకుల పాఠశాలలో అండర్-19 ఖోఖో, చెస్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో తెనాలి, నరసరావుపేట, వీపీ సౌత్, గుంటూరు, క్రోసూరు, పిడుగురాళ్లకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు పీఈటీ జయశ్రీ తెలిపారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఇందిరా ప్రియదర్శిని పోటీలను ప్రారంభించారు.

పెదకూరపాడు: అచ్చంపేటలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కె శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వాలీబాల్, కబడ్డీ తదితర పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను డైరెక్టర్ గుత్తా కవిత రాము అభినందించారు.

కారంపూడి: నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. 17 ఏళ్లలోపు విభాగంలో హర్షిణిబాయి పరుగు, జావలిన్‌త్రోలో ప్రతిభ చూపింది. దుర్గాబాయి, ప్రమీల పరుగు పందెంలో సత్తాచాటి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. 14 ఏళ్లలోపు విభాగంలో శ్రీవల్లి, పూజ పరుగు పందెం పోటీలకు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయురాలు ప్రమీల పేర్కొన్నారు.


అచ్చంపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తూ..


ఏవోను ప్రశ్నిస్తున్న రైతులు

వరద ముంచెత్తినా పరిహారం ఇవ్వరేం?

అమరావతి, న్యూస్‌టుడే: కృష్ణానది వరద కారణంగా పెదమద్దూరు వాగు పొంగి, నాలుగు రోజులపాటు పెదమద్దూరు, వైకుంఠపురం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వందల ఎకరాలు నీట మునిగి పంటలు దెబ్బతిన్నాయి. అయితే ఆ గ్రామాల రైతులకు పరిహారం అందకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నష్టం అంచనా వేసిన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తమకు పరిహారం అందకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అమరావతిలోని ఏవో కార్యాలయానికి వచ్చి ఆందోళన చేపట్టారు. తమ పేర్లు నష్టపరిహార జాబితాలో ఎందుకు చేర్చలేదని ఏవో అహ్మద్‌ను ప్రశ్నించారు. వైకాపా నేతల ఇళ్లలో కూర్చొని వ్యవసాయ సిబ్బంది తమకు అన్యాయం చేశారని రైతులు ఏవో దృష్టికి తీసుకొచ్చారు. సుమారు 50 మంది రైతులకు పరిహారం అందాల్సి ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ నాగమల్లేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు.

అచ్చంపేట: వరద ముంపునకు గురైన పంట పొలాలకు పరిహారం అందలేదని రైతులు అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఓర్వకల్లు, రుద్రవరం రైతులు ఓర్వకల్లు చెరువు కింద పత్తి, వరి సాగు చేశారు. ఇటీవల వరదలకు చెరువు నీరు పొంగి పొలాల మీదుగా ప్రవహించడంతో పొలాలు నీట మునిగాయి. స్థానిక వీఆర్వో, వ్యవసాయశాఖ సిబ్బందికి తెలియజేసినా తమ పేర్లను పరిహారం జాబితాలో లేకుండా చేశారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముంపునకు గురైన పంటల ఫొటోలను ప్రదర్శించారు. ఎన్యూమరేషన్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమకు పరిహారం మంజూరు కాలేదని వారు వాపోయారు. వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలని తహసీల్దార్ జి.శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.

గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నేడు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని అంజిరెడ్డి ఆసుపత్రిలో ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా శనివారం గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈసీజీ, 2డీ ఎకో వైద్య పరీక్షలు చేస్తారన్నారు. నరసరావుపేటలోని అంజిరెడ్డి ఆసుపత్రిలో ఆదివారం గుండె వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామన్నారు.

దత్త ఆసుపత్రిలో..: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా పట్టణంలోని దత్త సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 28 నుంచి 30 వరకు ఉచితంగా వైద్యపరీక్షలు చేస్తారని వైద్యుడు గార్లపాటి కృష్ణకాంత్ తెలిపారు.

గ్రామాల్లో సమస్యలపై చర్చ

దాచేపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ కందుల జాన్ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల్లో సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు


పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి రవి

అచ్చంపేట, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులను అదుపులోకి తెచ్చేందుకు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి శుక్రవారం ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది డ్రైడే పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, డ్రైడే, జ్వరాల సర్వే, సుఖప్రసవాలు తదితర అంశాలకు సంబంధించిన సిబ్బంది, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా తదితర చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్బన్ పీహెచ్‌సీల్లో ఏడు వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్, వైద్యులు స్రవంతి, రాంబాబు, పర్యవేక్షకులు శివనాగేశ్వరి, బేబిరాణి పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించరూ..



కొండమోడులోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇరువైపులా ప్రైవేటు స్థలాల్లో గ్రామస్థులు చెత్త, చెదారం వేస్తుండటంతో చిన్నారులు దుర్వాసనతో అల్లాడుతున్నారు. పైగా అక్కడ వ్యర్థాలను తినేందుకు కుక్కలు చేరి విద్యార్థులపై దాడి చేస్తున్నాయి. దోమలు వృద్ధి చెందుతున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి పాఠశాల సమీపంలోని వ్యర్థాలను వెంటనే తొలగించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కొండమోడు(రాజుపాలెం)**

వణికిస్తున్న గ్రామ సింహాలు

కుక్కల బెడదతో వీధుల్లో తిరగాలంటే చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. చేతిలో చిన్న పొట్లం సంచి కనిపిస్తే చాలు వాటి కోసం కుక్కలు దాడులు చేస్తున్నాయి. రోజురోజుకు సమస్య ఎక్కువవుతోందని ప్రజలు వాపోతున్నారు. కుక్క కాటుకు గురైన బాధితుల సంఖ్య పెరుగుతోంది. అవి రోడ్డుపై అడ్డదిడ్డంగా తిరుగుతుండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గురజాలతో పాటు అన్ని గ్రామాలోనూ వాటి బెడద ఎక్కువగా ఉంది. ఇటీవల పట్టణంలోని వెంకటరావు కాలనీకి చెందిన చిన్నారి తినుబండరాలు కొనుక్కొని ఇంటికి వెళుతుండగా కుక్కలు దాడి చేశాయి. స్థానికులు గమనించి శునకాలను తరిమేయడంతో బాలికకు ప్రమాదం తప్పింది. త్వరలో కుక్కలను పట్టించి, సుదూర ప్రాంతాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ చెన్నయ్య తెలిపారు.

- న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ


కారంపూడి రహదారిపై గుంపులుగా శునకాలు

ఒక్కో అడుగు.. స్వచ్ఛత వైపు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: యువత స్వచ్ఛభారత్ వైపు అడుగులు వేయాలని కాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ దివి లలితబాబు, ప్రిన్సిపల్ అశోక్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కాలుష్య నియంత్రణ బోర్డు సౌజన్యంతో స్థానిక జనచైతన్య సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కాలుష్య రహిత గ్రామాలే లక్ష్యంగా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జనచైతన్య సమితి కార్యదర్శి స్టాలిన్‌బాబు అన్నారు.

రాజుపాలెం: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రాజుపాలెం కస్తూర్బా, గణపవరం జడ్పీ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. డీబీఆర్సీ ఏరియా కోఆర్డినేటర్ కోటి రత్నం, కస్తూర్బా ఎస్‌వో జ్యోతిర్మయి మాట్లాడారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

అమరావతి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అమరావతి బాలికల గురుకుల పాఠశాలలో కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. స్వాభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు బెన్నిబాబు తెలిపారు.

రోటరీ క్లబ్ సభ్యుడి సేవలు భేష్


కాశీవిశ్వనాథం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ డిస్ట్రిక్ క్యాబినెట్ సభ్యుడు, పల్వరైజింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యక్కల కాశీ విశ్వనాథం సేవలు భేష్ అని పలువురు కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో యక్కల కాశీవిశ్వనాథం వైకుంఠ సమారాధన కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. సభలో క్లబ్ సభ్యులు, పల్వరైజింగ్ అసోయేషన్ సభ్యులు మాట్లాడారు. సభ్యులు బొల్లా శ్రీనివాసరావు, వంకాయల గోపి, జుజ్జూరి పుల్లారావు, ఆత్మకూరి శ్రీనివాసరావు, ఏవీఆర్ చౌదరి, మారం శ్రీనివాసరావు, మాశెట్టి మల్లిఖార్జునరావు, గుండా అశోక్‌బాబు, నీరుమళ్ల రాజేష్, కట్టమూరి శంకరరావు, తాడేపల్లి నాగేశ్వరరావు, భాస్కరరావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై గిరిబాబు బాధ్యతల స్వీకరణ

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు ఎస్సైగా జి.గిరిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వట్టిచెరుకూరు, అమృతలూరు, తాడేపల్లిలో విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సైకు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

మొబైల్ సిగ్నల్ టవర్ రాగి తీగ చోరీ

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: నార్నెపాడు గ్రామంలోని మొబైల్ సిగ్నల్ టవర్‌లోని రాగి తీగను శుక్రవారం తెల్లవారుజామున దొంగలు చోరీ చేశారు. టవర్‌లోని 162 మీటర్ల రాగి తీగ చోరీ అయినట్లు పర్యవేక్షకులు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని పోలీసులకు సమాచారం అందించారు.

నేరాల నియంత్రణకు కృషి

గురజాల, న్యూస్‌టుడే : నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురజాల పోలీసుస్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిర్యాదు దారులతో మాట్లాడే విధానం గౌరవంగా ఉండాలని ఎస్పీ రిసెప్షన్ కానిస్టేబుల్‌ను ఆదేశించారు. దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసులను పరిష్కారం చేయాలని సీఐ భాస్కర్‌కు సూచించారు.

న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కేంద్రం అనుసరిస్తున్న విధానాలు, కొత్తగా అమల్లోకి తెస్తున్న చట్టాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం విధులు బహిష్కరించి స్థానిక తాలుకా కోర్టులోని న్యాయదేవత విగ్రహం వద్ద న్యాయవాదులు నిరసన తెలియజేశారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడదామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్, ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ పిలుపునిచ్చారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: బాలికల్లో రక్తహీనతతో పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉమాదేవి తెలిపారు. ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత సమస్యతో ఎంతోమంది విద్యార్థులు, ప్రజలు రోగాల బారిన పడి మృత్యువాత పడ్డారన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మి సులోచన, శారదాదేవి, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు

రక్షణ చట్టాలపై అవగాహన తప్పనిసరి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మహిళలు, బాలికల రక్షణ, భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కల్పించే బాధ్యత విద్యావంతులదే అని దళిత బహుజన రిసోర్సు సెంటర్ ప్రాంతీయ సమన్వయకర్త మల్లెల చిన్నప్ప అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

ప్రజాశక్తినగర్‌లో కమిషనర్ పర్యటన

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌లో పురపాలక సంఘం కమిషనర్ పి.శ్రీధర్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు మురుగునీటి పారుదల కాల్వలు నిర్మించాలని కోరారు. నిధులు వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.

పాముకాటుకు మహిళ మృతి


సత్తెనపల్లి గ్రామీణ: ధూళిపాళ్ల వద్ద పాముకాటుకు గురై చెన్నంశెట్టి శివమ్మ(40) అనే మహిళ మృతి చెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పట్టణానికి చెందిన శివమ్మ ధూళిపాళ్ల సమీపంలోని ఎద్దువాగు నీటిలో చేపలు పట్టేందుకు వల వేసి ఒడ్డున నిరీక్షిస్తుండగా.. పాము కాటేసింది. ఆమెను సత్తెనపల్లి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది.

మెనూ పాటించకపోతే ఎలా?

దుర్గి, న్యూస్‌టుడే: దుర్గి బీసీ బాలుర వసతి గృహాన్ని మండల తెదేపా నాయకుడు ఏచూరి సాయిశంకర్ గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఆ సమయంలో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో నేరుగా వంట గదిలోకి వెళ్లి విద్యార్థుల మెనూ గురించి వంట మనిషి లక్ష్మిని అడిగారు. ఆమె సక్రమంగా వివరాలు చెప్పకపోవడంతో వంటలను పరిశీలించారు. నీళ్ల సాంబారును చూసి మండిపడ్డారు. అనంతరం వార్డెన్ బెనహర్‌బాబు రావడంతో ఆయనపై ఆగ్రహించారు. మెనూ ప్రకారం గురువారం రాత్రి బెండకాయ ఫ్రై, సాంబారు, ఉడికించిన కోడిగుడ్డు అందించాల్సి ఉంది. బెండకాయ ఫ్రై లేదు. సాంబారు కూడా నీళ్లగా ఉందని వార్డెన్‌ను ప్రశ్నించారు. విద్యార్థులు 100 మందికి గాను 66 మందే ఉన్నారు.. మిగతా విద్యార్థులు ఎక్కడని అడగ్గా జ్వరాలు రావడంతో ఇళ్లకు వెళ్లారని వార్డెన్ సమాధానమిచ్చారు. త్వరలో మళ్లీ వసతి గృహాన్ని సందర్శిస్తానని, అప్పటిలోగా ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని తెదేపా నాయకుడు వార్డెన్‌ను హెచ్చరించారు.

వీడని పీటముడి

- కొలిక్కిరాని రేషన్ దుకాణాలు
- వీఆర్‌ఏ, వీఆర్వోల పేర్లపైనే కొనసాగింపు


మాచవరంలోని రేషన్ దుకాణం

మాచవరం, న్యూస్‌టుడే: కూటమి అధికారంలోకి వచ్చి మూడు నెలలకు పైగా అవుతోంది. వందరోజులు పూర్తి చేసుకుని వారంరోజులపాటు అధికారిక కార్యక్రమాలు నిర్వహించింది. ‘ఇది మంచి ప్రభుత్వం’ పేరుతో సచివాలయ సిబ్బంది, నేతలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు, స్టిక్కర్లు అంటించారు. అంతవరకు బాగానే ఉన్నా.. రేషన్ దుకాణాల అంశం కొలిక్కి రాలేదు. సర్కారు కొలువుదీరిన తొలి రోజుల్లో ఆశావహులు ఎక్కువగా ఉండటంతో ఎంపిక క్లిష్టతరంగా మారింది. ఆ సమయంలోనే నిత్యావసర సరకుల పంపిణీ బాధ్యత వీఆర్‌ఏ, వీఆర్వోలకు అప్పగించారు. తర్వాత గ్రామాల్లో కేటాయింపులు జరిగినా, ఇంతవరకు వారి పేర్ల మీద దుకాణాలు మార్చలేదు. ఇప్పటివరకు దుకాణాల నిర్వహణ బాధ్యతలు వీఆర్‌ఏ, వీఆర్వోలే చూస్తున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి

మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 37 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటిల్లో 17,481 తెల్లరేషన్ కార్డులు, 49,423 కార్డుదారుల సభ్యులు ఉన్నారు. నెలకు దాదాపు 250 టన్నుల బియ్యం, ఇతర నిత్యావసర సరకులు మండలానికి వస్తున్నాయి. అయితే ఏ పార్టీ అధికారంలోకి వస్తే, ఆ పార్టీ శ్రేణులు రేషన్ దుకాణాలు దక్కించుకోవడం షరా మామూలుగా మారింది. ఆ ప్రకారం కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే వైకాపాకు అనుకూలంగా ఉన్న దుకాణదారులు అందరూ రాజీనామా చేయడం, సెలవు పెట్టడం జరిగింది. దాంతో అధికార తెదేపా శ్రేణులు దుకాణాలు దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. పోటీ ఎక్కువగా ఉండటంతో మండల నేతలకు తలనొప్పిగా మారింది. రేషన్ దుకాణాలు, క్షేత్ర సహాయకుల పోస్టులకు పోటీ నేపథ్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు ప్రతి గ్రామాన్ని సందర్శించారు. ఎవరెవరికీ దుకాణాలు కేటాయించాలో వారు తేల్చారు. అప్పట్నుంచి తెదేపా శ్రేణులు అనధికారికంగా దుకాణాలు నిర్వహిస్తున్నా, అధికారికంగా వీఆర్‌ఏ, వీఆర్వో పేర్ల మీదనే ఉన్నాయి. దాంతో క్షేత్ర స్థాయిలో అయోమయం నెలకొంది. అధికారులు స్పందించి, పీటముడిని తొలగించాలని కోరుతున్నారు.